క్లుప్తంగా

పాలమూరు తరలివెళ్లిన సీపీఎం నాయకులు



నారాయణపేట: మహబూబ్‌నగర్‌లో జరిగే సీపీఎం పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనడానికి శనివారం నారాయణపేట జిల్లానుంచి పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు.. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాల్ బాల్‌రాం మాట్లాడుతూ.. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. పదేండ్ల మోదీపాలన ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని తెలిపారు కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంజిలయ్యగౌడ్ పుంజనూర్ ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జోషి, కాశప్ప, బాలప్ప, బొమ్మన్ పాడ్ బాల్‌రాం, నరహరి, మహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ. 600 పెంచాలి



మక్తల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలకు రూ. 600 పెంచాలని ఏఐటీయూసీ ఇఫ్ట్యూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు భగవంతు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దాసర్‌దొడ్డిలో కొనసాగుతున్న ఉపాధిపనుల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, నిత్య అవసరధరలు అధికంగా పెరిగిపోతున్నాయన్నారు. ఉపాధి పనుల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని కోరారు. ప్రస్తుతం ఒక్కరోజు కూలి రూ. 600 పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూలీలలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పండ్ల పంపిణీ

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కొంత సమయం ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు ఆటలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఈటీ రమణ, శ్రీలత పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



నారాయణపేట రూరల్: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని నేతన్నలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీసీ కులాల కో-ఆర్డినేటర్ ఆవుల గోవర్దన్ కోరారు. శనివారం పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించి ముఖ్యమైన నాయకులతో చర్చించారు. మహబూబ్‌నగర్‌లోని సుదర్శన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం సమావేశం ఉంటుందన్నారు. బీసీలను చైతన్యం చేయడంలో భాగంగా ముందస్తుగా నేతన్నలను కలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సుధాకర్, పూడూర్‌శ్రీను, రఘువీర్, సంగ నర్సింహులు, చింత వెంకటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నర్వ: రేషన్ బియ్యం అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉందేకోడ్‌లో ఎరుకలి మణెమ్మ ఇంట్లో పోలీసులు తనిఖీలు చేయగా 20క్వింటాళ్ల బియ్యం పట్టుకుని స్వాధీనం చేసుకుని కేసునమోదుచేసినట్లు ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. దాదాపు 63బస్తాల బియ్యం ప్యాకెట్లు ఉన్నాయన్నారు. అనుమతి లేకుండా బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అంజనాద్రికి పాదయాత్ర



కృష్ణా: మండలంలోని తంగిడి గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు శనివారం కర్ణాటకలోని అంజనాద్రి గుట్ట ఆంజనేయస్వామికి దాదాపు 221కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి చేరుకున్నారు. ఈ మేరకు.. ఆలయ అర్చకుడు అణ్ణెప్ప పూజారితోపాటూ గ్రామ యువకులు తరలివెళ్లారు.

కలగానే బీటీ రహదారి..



కంకర తేలిన జక్కన్నపల్లి రహదారి (ఫైల్)

- కంపచెట్లతో మూసుకుపోయిన దారులు
- అడుగడుగున గోతులతో ప్రయాణ ఇబ్బందులు
- కనీసం మట్టి రోడ్డుకు నోచుకుని గ్రామాలు

నర్వ: ఏళ్లుగా బీటీ రహదారి లేక కలగానే మిగిలింది. మండల కేంద్రంలోని లక్కర్‌దొడ్డికి బీటీరోడ్డు లేక గుంతల రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపుగా పెరిగిన ముళ్లకంపతోపాటు గోతులు పడ్డ రహదారితో కనీసం బైక్‌ల ప్రయాణానికి ఇబ్బందులేనని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంతో పాటు కొత్తపల్లి గ్రామం దశాబ్దాలుగా రహదారి సమస్యతో సతమతమవుతుంది. కొత్తపల్లినుంచి పెద్దకడ్మూర్‌కి వెళ్లేందుకు ప్రజలు నిత్యం ప్రతి పనికి ఈ దారి గుండానే ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డుకు కనీసం మట్టిరోడ్డుకు నోచుకోలేక ప్రయాణికులు గోతుల రహదారిపైనే ప్రయాణం చేస్తున్నామని వాపోతున్నారు. ఈ గ్రామానికి ఇటీవల ఎమ్మెల్యే తనసొంత నిధులతో గజ్జలమ్మ వాగుపై బ్రిడ్జీ నిర్మాణం చేసిన నేపథ్యంలో బీటీ రహదారి ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీంతోపాటు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గ్రామం జక్కన్నపల్లి రోడ్డు సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం గ్రామస్తులు మండల కేంద్రానికి రావాల్సిందే. ఈ రహదారిని బీటీచేయాలని గ్రామస్తులు అనేక వినతులు చేపట్టిన ఏ అధికారులు, పాలకులు గాని పట్టించుకునే పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం పాఠశాలకు పదుల సంఖ్యలో విద్యార్థులు ఈ దారిగుండా వెళ్తుంటారు. ప్రతి పనితోపాటు అత్యవసర సమయాల్లో వెళ్లేందుకు ఆటోలు, బైక్‌లే దిక్కని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు, ప్రజాప్రతినిధులు బీటీరోడ్డు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

కలగానే బీటీ రహదారి..



ఏళ్లుగా బీటీ రహదారి కలగానే మిగిలింది. మండల కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న జక్కన్నపల్లికి కంకర తేలిన మట్టిరోడ్డు దిక్కు. ఈ మార్గం గుండానే బస్సు ప్రయాణం చేస్తున్నాం. అడుగడుగున గోతులు కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. తమ గ్రామానికి బీటీరోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– కోట్ల నాగిరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జక్కన్నపల్లి గ్రామం

బీటీ రోడ్డు ఏర్పాటు చేపట్టండి



తమ కొత్తపల్లి గ్రామానికి రావడానికి ప్రధాన అడ్డంకిగా మారిన వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఇటీవల మాజీ ఎమ్మెల్యే తనసొంత నిధులతో ఏర్పాటు చేశారు. బీటీ రహదారి లేక గుంతల రోడ్లపై నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ నేపథ్యంలో పెద్దకడ్మూర్ నుంచి తమ గ్రామానికి మూడు కిలోమీటర్లు బీటీ రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి బీటీరోడ్డు ఏర్పాటుచేసి తమ ప్రయాణ ఇబ్బందులు తొలగించాలి.

– సుజాత, మాజీ సర్పంచ్, కొత్తపల్లి గ్రామం

ఇబ్బందులు తీర్చాలి..



నిత్యం లక్కర్‌దొడ్డి నుంచి సమీప గ్రామమైన మండలానికి ప్రతి పనికి వస్తుంటాం. ఉన్న రహదారి అడుగడుగున గుంతలతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఈ మార్గం గుండా ఆటోలు కూడా వెళ్లవు. కేవలం రెండు కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాన్ని బీటీ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– శివన్న, తాజా మాజీ సర్పంచ్. లక్కర్‌దొడ్డి గ్రామం

ప్రతి పాదనలు సవరిస్తాం..

గతంలో మట్టి రహదారులను బీటీగా మార్చేందుకు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ఆదేశానుసారం మరో మారు పరిశీలించాం. ప్రస్తుత ధరలకు అనుగుణంగా అంచనాలను సవరించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– మారెప్ప, పీఆర్ ఏఈ, నర్వ

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



లక్కిర్‌దొడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

దామరగిద్ద: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేస్తుందని ఎన్నికల కోడ్‌తో విషయాన్ని అందరు గుర్తించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయాగ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో వివిధ అభివృద్ధిపనులు చేసుకోవచ్చని అన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి ఎంపీగా వంశీచందర్‌రెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధిని సాదించుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శరణ్ నాయక్, ఖాజా, రఘు, వెంకట్రామరెడ్డి, నర్సింహులు, ఎంపీటీసీ బస్వరాజ్, హన్మంతు, జయదేవ్ రెడ్డి, వినోద్, శేర్ వెంకట్‌రెడ్డి, భగవంత్, బాపనపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పర్ణికారెడ్డి గెలవాలని, గెలిస్తే కోడెదూడను చెల్లిస్తానని స్థానిక ఆంజనేయస్వామికి మొక్కుకున్న యువనాయకుడు వినోద్ శనివారం ఎమ్మెల్యే సమక్షంతో తన మొక్కును చెల్లించుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, వెంకట్రామరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

నర్వ: పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపుఖాయమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని లక్కిర్‌దొడ్డిలో హర్ ఘావ్ ఏక్ గంట కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీగెలుపు కోసం అందరు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్యగౌడ్, మాదిరెడ్డిజలంధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి, జగదబిరెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..



నారాయణపేటలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

నారాయణపేట: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం మండలంలోని భైరంకోండ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మప్ప, హోటల్ కృష్ణ, శివప్ప, డోలు ఎల్లప్ప, బసప్ప, పిట్టల ఆశప్ప, జగదీష్, బీరప్ప, మీల్లర్ సాబప్ప, కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా జాజాపూర్ బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలకు శివన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు డి. నర్సింహులు, బొంత వెంకటేష్, కన్కప్ప, రమేష్, జగిరి కన్కప్ప, నర్సింహులు, కనకాద్రి, హన్మంతు, బ్రహ్మయ్య, లక్ష్మప్ప తదితరులు మండల కాంగ్రెస్ నాయకుడు గూళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు.

మాగనూర్: మండలానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ పెద్దింటిరాజు బీఆర్ఎస్‌కు రాజీనామాచేసి శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, సీనియర్ నాయకులు వాకిటి శ్రీనివాసులు, ఉజ్జెల్లి కృష్ణయ్య, దండు సత్యనారాయణ, వేణుగోపాల్, బాలకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



జలాల్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట: మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని జలాల్‌పూర్‌లో మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు, నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ నర్సింహులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, ఆంజనేయులుగౌడ్, రాములు, చంద్రకాంత్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊట్కూరు: ఎంపీ అభ్యర్థి చల్లవంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని శనివారం ప్రచారంలో భాగంగా మండలంలోని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఎల్కోటి లక్ష్మికాంత్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు లింగం, మహేష్, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

మాగనూర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వాకిటి శ్రీనివాసులు, వేణుగోపాల్, ఉజ్జెల్లి కృష్ణయ్య, దండు సత్యనారాయణ, గడ్డం వెంటకయ్య, గడ్డం నరేష్ పాల్గొన్నారు.



మక్తల్‌లో..

శతాధిక వృద్ధురాలు మృతి



శేషమ్మ (ఫైల్)

మరికల్: మండల కేంద్రానికి చెందిన వేముల వెంకటశేషమ్మ(105) శనివారం కన్నుమూశారు. ఈమె రజాకర్ల పరిపాలనకు వ్యతిరేకంగా అనేక వ్యాసాలు రాయడమే కాకుండా వారిని ఎదిరించేందుకు ఉద్యమంలో కూడా పాల్గొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. రెండో కుమారుడు మృతిచెందాడు. శతాధిక వృద్ధురాలు శేషమ్మ మృతి వార్త తెలియగానే పెద్ద సంఖ్యలో గ్రామస్తులతోపాటు చుట్టూ పక్కల గ్రామస్తులు కూడా తరలివచ్చి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మండల సమావేశానికి హాజరుకాని అధికారులు



కృష్ణా: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తామని ప్రకటించిన ఎంపీడీఓ జానయ్య తీరా ఆ సమావేశానికి ఆయనే హాజరు కాకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని ఏ శాఖ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరుకాకుండగా మమ అనిపించారు. ఎన్నికల కోడ్ ఉండడంతో ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరుకాకపోయిన కనీసం అధికారులైన హాజరై పలు విషయాలపై చర్చించాల్సి ఉంటుంది. కాని అధికారులు నిర్లక్ష్యంగా సమావేశానికి హాజరు కాకుండగా పోవడం విశేషం.

ఉన్నత చదువుల్లో రాణించాలి

అమరచింత: పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థిని నుజాహత్‌ను శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ విద్యలో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి తన తల్లిదండ్రులతో పాటు పట్టణానికి మంచి పేరు, ప్రతిష్టతలు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లిందని, ప్రభుత్వ కళాశాలలు, గురుకులాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

హిస్టరీ అధ్యాపకుడికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీయార్ మహిళా డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగాధిపతి శ్రీపాద గంగాధర్‌కు ఏపీలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ అధ్యాపకుడు ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ రెడ్డి పర్యవేక్షణలో 'హిస్టారికల్ స్టడీ ఆఫ్ గద్వాల సంస్థానం'పై పరిశోధన చేశారు. దీంతో డాక్టరేట్ దక్కగా శనివారం ఈయనను కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.విజయ్‌కుమార్, అధ్యాపక బృందం అభినందించింది. కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ సురయ్య జబీన్, అర్థశాస్త్ర విభాగాధిపతి పి.సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేశ్వరి, అధ్యాపకులు వాసంతి, రవళి, ఎ.కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాభవనం నిర్మించాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కళాకారులు

నారాయణపేట రూరల్: కళలకు జీవం పోస్తున్న బాలకేంద్రానికి సొంత భవనం నిర్మించాలని కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ కోరారు. శనివారం పట్టణంలోని బాలకేంద్రానికి వచ్చిన ఆయన పిల్లలతో మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరానికి వస్తున్న ఆదరణపై సూపరింటెండెంట్‌ను అభినందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో 500మందికి పైగా కళాకారులు ఉన్నారని, నృత్య సంగీత కార్యక్రమాలు నిర్వహించడానికి కళాభవనం ఎంతో అవసరం ఉందన్నారు. అనంతరం ఆయనను కళాకారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీబాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సుధాకర్, రఘువీర్‌యాదవ్, శ్రీనివాస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



కోస్గిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మరికల్‌లో..

కోస్గి: /మద్దూర్: కోస్గి పట్టణంలోని 13వ వార్డులో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, డీకే.రాములు, ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిచాలని కోరారు. అలాగే మద్దూర్ మండలంలోని మన్నాపూర్, కొత్తపల్లి, దోరేపల్లి, భూనీడ్, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంపీ అభ్యర్థి మన్నెం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల మండల ఇన్‌చార్జి వీరరాఘవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, శివకుమార్, విజయభాస్కర్‌రెడ్డి, గోపాల్, చంద్రశేఖర్, వెంకటయ్య పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని అప్పంపల్లిలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, తిరుపతయ్య, రామస్వామి, అనంత్‌రెడ్డి, బసంత్, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని నేరడగంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజుల అశిరెడ్డి, నాయకులు హుసేనప్ప, జమీల్ అహ్మద్. శంకర్‌గౌడ్, ఖజాన్‌గౌడ్, మోగులప్ప పాల్గొన్నారు.

బీజేపీ విజయం కోసం కృషిచేయాలి



నర్వలో మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి



ఊట్కూర్‌లో పార్టీలో చేరిన వారితో డీకే. అరుణ

నర్వ: పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపుకోసం కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బూత్ కమిటీ అధ్యక్షుడు కష్టపడి పనిచేయాలని, ప్రతి బూత్ నుంచి మెజార్టీ ఓట్లు తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కో-కన్వీనర్ రేచింతల శ్రీనివాసులు, కార్యదర్శి కుర్వ సత్యం, కుర్వ హరిష్, క్యామ భాస్కర్ పాల్గొన్నారు.

మాగనూర్: ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో మండల బీజేపీ నాయకుల ప్రచారం జోరుగా చేస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధన్వాడ: ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని మండల బీజేపీ నాయకులు శనివారం ఉపాధికూలీల వద్దకు వెళ్లి కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల అధ్యక్షుడు మకం సురేందర్, విజయ్‌కుమార్, గోపి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రప్ప, నర్సింహులు, సంజీవ, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని జిన్నారం శివారులో కొనసాగుతున్న ఉపాధిపనుల కూలీల వద్ద శనివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ కుమార్తె డీకే. స్నిగ్ధరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేస్తున్న అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామేశ్వర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..

ఊట్కూరు: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కొండూరు, ఓబులాపూర్, అమీన్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి ఆమె కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, సమరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కుర్వగుట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం తప్పదు



ప్రచారంలో పాల్గొన్న విజయరాములు

అమరచింత: దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కోసం ప్రతి ఒక్కరూ మతోన్మాద బీజేపీని ఓడించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని కొంకన్‌వానిపల్లిలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయరాములు మాట్లాడుతూ బీజేపీతో ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు ముప్పుపొంచి ఉందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి ప్రధాని పదవిలో కొనసాగుతున్న నరేంద్రమోదీ హిందూ, ముస్లిం మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోషా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, లక్ష్మినారాయణ శెట్టి, మల్లేష్, వెంకటేష్, అంజిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు ప్రభుత్వ సంస్థల ధారాదత్తం



మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: ప్రజల్లో మత చిచ్చు రగిలిస్తూ లబ్ధి పొందాలని చూస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీహెంచ్ రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలోని మార్క్ భవనంలో శనివారం మాస్‌లైన్ పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సంపదను కార్పొరేట్ శక్తులకు దారపోయడమే బీజేపీ లక్ష్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిందని కార్మిక వర్గానికి ఉపయోగ పడే చట్టాలను రద్దు చేస్తు పెట్టుబడి దారులకు అండలం వేసిన కేంద్ర ప్రభుత్వంపై కార్మిక లోకం తిరగబడే రోజు ఆసన్నమైందన్నారు. దేశం నడిబొడ్డులో రైతులు తమ హక్కుల కోసం ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తుంటే రైతులను ఆదుకోవాల్సిన బీజేపీ ప్రభుత్వం, వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశాన్ని మతం పేరిట ప్రజలలో అంతర్గత కలహాలు కలిగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసి బీజేపీని గద్దె దించాలని కోరారు. సమావేశంలో నందిమళ్ల ఎంపీటీసీ, జిల్లా కార్యదర్శి హనుమంతు, డివిజన్ కార్యదర్శి ప్రసాద్, రాజన్న, గణేష్ పాల్గొన్నారు.

పాలమూరులో ఆర్యవైశ్య అభినందన సభ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన కల్వ సుజాత అభినందన సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమ కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. చైర్మన్ కల్వ సుజాత మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్యవైశ్య సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు ఎదిరె ప్రమోద్‌కుమార్, మిర్యాల వేణుగోపాల్, కొండ చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.